సాక్షి నల్లగొండ

మంగళవారం : 28 : ఫిబ్రవరి : 2023



నేడు యాదగిరీశుడి కల్యాణం

యాదాద్రిలో మంగళవారం శ్రీలక్ష్మీనర సింహస్వామి కల్యాణ మహోత్సవానికి ఏర్పాట్లు పూర్తి చేశారు. - 8లో



ఆస్పత్రిలో మిన్నంటిన రోదనలు

ఆత్మహత్య చేసుకున్న రాకేశ్, దేవి మృతదేహాలకు దేవరకొండ ప్రభుత్వ ఆస్పత్రిలో పోస్టుమార్టం నిర్వహించారు. - 10లో

వాతావరణం

గరిష్టం/కనిష్టం 36°/17°

ఆకాశం నిర్మలంగా ఉంటుంది. మధ్యాహ్నం ఎండ తీవ్రత ఎక్కువగా ఉంటుంది.

న్యూస్‌రీల్

నేడు రాజీవ్ స్వగృహ ప్రీ బిడ్ సమావేశం

నల్లగొండ: నార్కట్‌పల్లి మండలం ఎల్లారెడ్డిగూడెంలో శ్రీవల్లి టౌన్‌షిప్‌లో మిగిలిన రాజీవ్ స్వగృహ ఓపెన్ ప్లాట్ల విక్రయానికి సంబంధించి మంగళవారం సాయంత్రం 4గంటలకు కలెక్టరేట్‌లో ప్రీ బిడ్ అవగాహన సమావేశం నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. వివరాలకు ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ సెల్ :9154339209ను సంప్రదించాలని సూచించారు.

దరఖాస్తుల ఆహ్వానం

రామగిరి(నల్లగొండ): నల్లగొండ ప్రభుత్వ మెడికల్ కళాశాల ఫిజియాలజీ విభాగంలో కాంట్రాక్టు పద్ధతిలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పని చేయుటకు ఆసక్తి గల అభ్యర్థులు మార్చి 2వ తేదీ లోపు దరఖాస్తులు చేసుకోవాలని కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. దరఖాస్తులు చేసుకున్న వారికి మార్చి 3వ తేదీన ఇంటర్వ్యూ నిర్వహించనున్నామని తెలిపారు. పూర్తి వివరాలు dme.telangana.gov.in, gmcnalgonda.in వెబ్‌సైట్లలో పొందుపర్చినట్లు పేర్కొన్నారు.

నక్కలగండి ముంపు ప్రాంతం పరిశీలన



పరిశీలిస్తున్న కమిటీ సభ్యులు

చందంపేట: ఎన్విరాన్‌మెంట్ ప్రొటెక్షన్ ట్రెనింగ్ అండ్ రీసెర్చ్ ఇనిస్టిట్యూట్ (ఈపీటీఆర్‌ఐ) జీవవైవిధ్య కమిటీ శాస్త్రవేత్తల బృందం, నీటిపారుదల శాఖ అధికారులు సోమవారం చందంపేట మండలంలోని నక్కలగండి ముంపు ప్రాంతాన్ని 2వ విడతలో భాగంగా పరిశీలించారు. వారివెంట నీటిపారుదల శాఖ ఈఈ జగన్మోహన్‌రెడ్డి, డీఈ చక్రపాణి, జేఈ మహేందర్, మాణిక్యరాజు, శ్రీనివాస్ ఉన్నారు.

నిరుద్యోగులకు శిక్షణ

నల్లగొండ రూరల్: ఎస్సీ నిరుద్యోగులకు వివిధ కోర్సుల్లో ఉచిత శిక్షణ ఇస్తున్నట్లు సోషల్ వెల్ఫేర్ శిక్షణ ప్రాజెక్టు జిల్లా కోఆర్డినేటర్ సైదులు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. జనరల్ డ్యూటీ అసిస్టెంట్, ఎమర్జెన్సీ మెడికల్ టెక్నీషియన్, డయాలసిస్ టెక్నీషియన్, ఫార్మసీ అసిస్టెంట్, డెంటల్ అసిస్టెంట్ కోర్సుల్లో మూడు నెలల కాల పరిమితితో భోజన వసతితో కూడిన శిక్షణ ఇస్తున్నట్లు పేర్కొన్నారు. మార్చి 3లోపు అభ్యర్థులు సెల్ : 9848581100 నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

నేడు 'డయల్ యువర్ ఆర్‌ఎం'

నల్లగొండ రూరల్: ఆర్టీసీ ప్రయాణికుల కోసం మంగళవారం డయల్ యువర్ ఆర్‌ఎం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఉమ్మడి నల్లగొండ జిల్లా ఆర్‌ఎం శ్రీదేవి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రయాణికులు తాము ఎదుర్కొంటున్న సమస్యలతోపాటు సంస్థ అభివృద్ధికి తగిన సలహాలు, సూచనలు అందించాలని పేర్కొన్నారు. సెల్ : 8688195076 నంబర్‌ను ఉదయం 11గంటల నుంచి మధ్యాహ్నం 12గంటల మధ్య సంప్రదించాలని కోరారు.

తెలుగింటి ఆడపడుచులాగా..



నల్లగొండలోని క్రిస్టియన్ క్లబ్ జూబ్లీ ఉత్సవాలకు అమెరికాకు చెందిన మహిళ మేథిల్‌దే చీర కట్టు బొట్టు, గాజులు ధరించి పూల జడ వేసుకొని తెలుగింటి ఆడపడుచులాగా వచ్చి ఆకట్టుకుంది. అమెరికాలోని క్యాలిఫోర్నియాకు చెందిన ఈమె క్రిస్టియన్ సొసైటీలో మెంబర్ కావడంతో స్థానిక సంప్రదాయ దుస్తులు ధరించి వచ్చింది.

– సాక్షి స్టాఫ్‌ఫొటోగ్రాఫర్, నల్లగొండ



మెడికో ప్రీతి ఆత్మకు శాంతి చేకూరాలని..

సీనియర్ విద్యార్థి వేధింపులతో వరంగల్ ఎంజీఎంలో ఆత్మహత్యాయత్నానికి పాల్పడి ఐదు రోజులుగా నిమ్స్‌లో చికిత్స పొందుతూ మృతి చెందిన మెడికో ధరావత్ ప్రీతి ఆత్మకు శాంతి చేకూరాలని సోమవారం నల్లగొండలో ఐద్వా ఆధ్వర్యంలో విద్యార్థినులు కొవ్వొత్తులు వెలిగించి నివాళులర్పించారు.

మార్చి 1న మిర్యాలగూడ మున్సిపల్ సమస్యలపై 'సాక్షి ఫోన్‌ఇన్'

ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు

మిర్యాలగూడ మున్సిపాలిటీ పరిధిలో కుక్కలు, కోతుల బెడదతో ఇబ్బందులు పడుతున్నారా.. తాగునీటి సరఫరా, పారిశుద్ధ్యం, వీధి దీపాల సమస్యలు ఎదుర్కొంటున్నారా.. అయితే మీ సమస్యలను నేరుగా మున్సిపల్ కమిషనర్‌కు తెలియజేయండి. మున్సిపల్ కమిషనర్‌తో మార్చి 1వ తేది (బుధవారం) 'సాక్షి' ఫోన్ ఇన్ కార్యక్రమం నిర్వహిస్తోంది.

సాక్షి ఫోన్‌ఇన్

ఫోన్ చేయాల్సిన నంబర్ : 98499 05914



రవీందర్‌సాగర్ మున్సిపల్ కమిషనర్, మిర్యాలగూడ

వరి.. తడారి

ఎండుతున్న పొలాలు

- వారబందీతో అన్నదాతలకు ఇబ్బందులు
- ఏఎమ్మార్పీ ఆయకట్టు చివరి భూములకు అందని కృష్ణాజలాలు
- నిరంతరం సాగునీరు ఇచ్చి ఆదుకోవాలని వేడుకలు
- ఎన్ఎస్పీ పరిధిలోనూ తప్పని కష్టాలు



గుర్రంపోడు మండలం నడికుడలో నీరందక ఎండిపోతున్న వరిపొలం

సాక్షి ప్రతినిధి, నల్లగొండ: ఉమ్మడి నల్లగొండ జిల్లాలోని నాగార్జునసాగర్ ప్రాజెక్టు(ఎన్ఎస్పీ), ఏఎంఆర్పీ, శ్రీరాంసాగర్ ప్రాజెక్టు (ఎస్సారెస్పీ) కాలువల కింద చివరి భూములకు నీరందడం లేదు. దీంతో పంట పొలాలు ఎండిపోతుండటంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. చివరి భూములకు నీరందిస్తామని నాయకులు చెబుతున్నా అమలుకు నోచుకోవడం లేదు. పంట పొలాలు ఎండిపోతున్నాయని రైతులు ఆవేదన చెందుతున్నారు. ఎస్సారెస్పీ పరిధిలోని మోతె మండలానికి చెందిన రైతులు సోమవారం సూర్యాపేట జిల్లా కలెక్టరేట్ ఎదుట ఆందోళన చేశారు. పురుగుల మందు డబ్బాలతో వచ్చి బైఠాయించారు. నాగార్జునసాగర్ ఎడమ కాలువ కింద కూడా అదే పరిస్థితి నెలకొనడంతో రైతులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. డిస్ట్రిబ్యూటరీలలో లైనింగ్ లేకపోవడంతో కంపచెట్లు పెరిగి కాలువలు దెబ్బతిన్నాయి. వచ్చే నీళ్లు కూడా రావడం లేదు. కొన్ని చోట్ల గండ్లు పడుతుండటంతో చివరి భూములకు నీరందడం లేదు. ఎలిమినేటి మాధవరెడ్డి ప్రాజెక్టు (ఏఎంఆర్పీ) కింద డిస్ట్రిబ్యూటరీలు సక్రమంగా లేక నీరందటం లేదు. వీటికితోడు వారబందీ విధానం రైతులకు శాపంగా మారుతోంది. ఈ విధానంలో ఆయకట్టు చివరి భూములకు నీరందక పంటలు ఎండిపోతున్నాయి.

వేల ఎకరాలకు అందని సాగునీరు

ఉమ్మడి జిల్లాలో నాగార్జునసాగర్ ఎడమ కాల్వ కింద 3.81 లక్షల ఎకరాల ఆయకట్టు ఉంది. అందులో 1.45 లక్షల ఎకరాలు నల్లగొండ జిల్లా పరిధిలో ఉండగా, మిగతాది సూర్యాపేట జిల్లా పరిధిలో ఉంది.



గుర్రంపోడు మండలం నడికుడ గ్రామానికి చెందిన ఈయన వడ్డగోని యాదగిరి గౌడ్. మూడెకరాల్లో వరి సాగు చేస్తున్నారు. కాలువ నీరు అందకపోవడంతో వరి పంట సగం దెబ్బతింది. మేజర్ కాలువ పక్కనే ఉన్న ఈయన పొలానికి అస్తవ్యస్త కాల్వ కారణంగా నీరు అందడం లేదు. అంతంతమాత్రంగా వచ్చే నీటిని ఎగువన రైతులు అడ్డుకట్టలు వేసి మళ్లించుకోవడంతో.. పొట్ట దశలో ఉన్న యాదగిరిగౌడ్ పొలం తడారిపోయింది.

సూర్యాపేట జిల్లాలోని ఎక్కువ శాతం వరి పొలాలకు సాగు నీరు అందటం లేదు. ఇక ఏఎంఆర్పీ కింద నల్లగొండ జిల్లాలో 2.50 లక్షల ఎకరాలకు నీరందాల్సి ఉండగా 2.29 లక్షలకు మాత్రమే అందుతోంది. వరద కాలవల కింద 50వేల ఎకరాలకు నీరు అందాల్సి ఉన్నా చివరి భూములకు నీరందడం లేదు.

అస్తవ్యస్తంగా కాల్వలు..

నల్లగొండ జిల్లాలో నాగార్జునసాగర్ ఎడమ కాల్వ పరిధిలోని ఆయకట్టు కాల్వలు అధ్వాన్నంగా మారాయి. తిరుమలగిరి (సాగర్) మండలంలో రాజవరం మేజర్‌కు సరిపడా నీరు రాక.. మేజర్ పరిధిలోని బోయగూడెం, కొంపల్లి, గ్రామాల్లో వేయి ఎకరాలకు నీరందక పంటలు ఎండిపోయే పరిస్థితి నెలకొంది. నిడమనూరు మండలంలోని ముదిమాణిక్యం మేజర్ పరిధిలోని రేగులగడ్డ గ్రామం చివరి భూములకు నీరు అందక పంటలు ఎండిపోతున్నాయి. నార్కెట్లగూడెం మేజర్ పరిధిలోని మార్ల గడ్డ తండా గ్రామ చివరి భూములకు నీరందడం లేదు. సూర్యాపేట జిల్లాలోని నడిగూడెం, కోదాడ మండలాల్లో పరిస్థితి అలాగే ఉంది. కోదాడ మండల పరిధిలోని రెడ్లకుంట మేజర్ పరిధిలోని రెడ్లకుంట, గణపవరం గ్రామాల పరిధిలో ఉన్న చివరి భూములకు నీరు అందడం లేదు. దీని పరిధిలో దాదాపు వెయ్యి ఎకరాల వరిపంట ఎండిపోతోంది. కొత్తగూడెం మేజర్ పరిధిలో గోండ్రియాల, చిమిర్యాల, మంగళితండ గ్రామాల పరిధిలో పొలాలకు నీరు అందడం లేదు. నడిగూడెం మండల పరిధిలోని కొమరబండ, పొలారం మేజర్ కాలువల చివరి భూములకు నీరు అందక రైతులు గగ్గోలు పెడుతున్నారు. మరోవైపు ఏఎంఆర్పీ కాలువల్లో గుర్రంపోడు మండలంలో కంప చెట్లు మొలిచాయి. పూడికలతో అస్తవ్యస్తంగా మారాయి. దీంతో ఆయకట్టు చివరి వరకు నీరందక పంటలు దెబ్బతింటున్నాయి. 130 కిలోమీటర్ల ప్రధాన కాలువలో ఐదేళ్ల కిందట కంపచెట్లు తొలగించడం మినహా ఇతర మరమ్మతు పనులేవీ చేపట్టలేదు. దీంతో ప్రధాన కాలువ అంచులు కోతకు గురై గండ్లు పడేలా తయారయ్యాయి. ఇక మేజర్ మైనర్ కాలువలు కంపచెట్లు, పూడికలతో నిండిపోవడంతో నీరందడం లేదు.



ఈయన జటావత్ మునినాయక్. నిడమనూరు మండలంలోని మార్లగడ్డ తండాకు చెందిన ఆయన తనకున్న రెండెకరాలతోపాటు మరో మూడెకరాలు కౌలుకు తీసుకుని వరి సాగు చేస్తున్నాడు. నార్కెట్లగూడెం మేజర్ కాలువకు చివరి ప్రాంతంలో ఈ తండా ఉంది. వారంరోజులుగా నీరు అందకపోవడంతో పొలం బీటలువారింది. మరి కొన్ని రోజులు కూడా నీరందకపోతే పూర్తిగా ఎండిపోతుంది. పంట చేతికిరాకుంటే.. తెచ్చిన అప్పులు మీదపడే పరిస్థితి నెలకొంది.



గుర్రంపోడు మండలం మొసంగి పరిధిలోని ఈ-22 మేజర్ కాల్వలో పెరిగిన చెట్లు

వారబందీతో అసలు సమస్య

ఎస్సారెస్పీ, ఏఎంఆర్పీ పరిధిలో వారబందీ అమలు చేస్తుండటంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు. చాలా చోట్ల కాలువల లైనింగ్ దెబ్బతినడం, అనేక చోట్ల లైనింగ్ లేకపోవడంతో నీరు చివరి ఆయకట్టుకు చేరడం లేదు. వారబందీ కారణంగా ఈ సమస్య మరింత తీవ్రంగా మారింది. ఒక వారం ఒక నిర్దేశిత ప్రాంతానికి ఇస్తే మరో వారం ఇంకో ప్రాంతానికి ఇవ్వడంతో నిర్దేశిత ప్రాంతానికి మళ్లీ నీరు వచ్చే సరికి ఆలస్యం అవుతోంది. దీంతో మధ్యలోని పొలాలు కూడా ఎండిపోతున్నాయి. ఇక చివరి ఆయకట్టులో పొలాలైతే పూర్తిగా ఎండిపోయే పరిస్థితి వస్తోంది.

తెలంగాణ రాష్ట్రం దేశానికే ఆదర్శం



సభలో మాట్లాడుతున్న మంత్రి జగదీశ్‌రెడ్డి, చిత్రంలో ఎంపీ, ఎమ్మెల్యే తదితరులు

- రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి జగదీశ్‌రెడ్డి
- హాలియా మార్కెట్ కమిటీ ప్రమాణ స్వీకారానికి హాజరు

హాలియా: రైతు సంక్షేమ పథకాల అమలులో తెలంగాణ రాష్ట్రం దేశానికే ఆదర్శంగా నిలిచిందని రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి అన్నారు. సోమవారం హాలియా పట్టణంలోని లక్ష్మినర్సింహ గార్డెన్‌లో నిర్వహించిన హాలియా వ్యవసాయ మార్కెట్ కమిటీ పాలకమండలి ప్రమాణస్వీకార కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా నిర్వహించిన సభలో మంత్రి మాట్లాడారు. నేను 18 సంవత్సరాల మంత్రిని, 35 ఏళ్ల శాసన సభ్యుడిని అని చెప్పుకున్న జానారెడ్డి ఎడమ కాల్వ మొదటి మేజరైన రాజవరానికి నీటిని ఎందుకు ఇవ్వలేదని ప్రశ్నించారు. రాష్ట్రంలోని రైతు సంక్షేమం కోసం 24 గంటల ఉచిత విద్యుత్, రైతు బంధు, రైతు బీమా వంటి పథకాలు అమలు చేసిన ఘనత కేసీఆర్‌దే అన్నారు. హాలియా వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టిన జవ్వాజి వెంకటేశ్వర్లు నేతృత్వంలో పాలకవర్గం రైతులకు ఉత్తమ సేవలందించి పేరు తెచ్చుకోవాలని ఆకాంక్షించారు. అంతకు ముందు పట్టణంలో ప్రధాన సెంటర్ నుంచి సాగర్ ఎమ్మెల్యే నోముల భగత్, మార్కెట్ కమిటీ చైర్మన్ జవ్వాజి వెంకటేశ్వర్లు ఊరేగింపుగా సభావేదిక వద్దకు చేరుకున్నారు. అనంతరం జిల్లా మార్కెటింగ్ అధికారి శ్రీకాంత్ హాలియా మార్కెట్ చైర్మన్‌గా జవ్వాజి వెంకటేశ్వర్లు, వైస్ చైర్మన్‌గా ఆడెపు రామలింగయ్యతో పాటు డైరెక్టర్లతో ప్రమాణస్వీకారం చేశారు. ఈ సందర్భంగా పాలకవర్గానికి మంత్రి శుభాకాంక్షలు తెలిపారు. ఎమ్మెల్యే భగత్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఎంపీ బడుగుల లింగయ్య యాదవ్, ట్రికార్ చైర్మన్ ఇస్లావత్ రాంచందర్ నాయక్, జెడ్పీ వైస్ చైర్మన్ ఇరిగి పెద్దులు, డీసీసీబీ డైరెక్టర్ విరిగినేని అంజయ్య, జెడ్పీటీసీ అబ్బిడి కృష్ణారెడ్డి, ఎంపీపీ బొల్లం జయమ్మ, మున్సిపల్ చైర్‌పర్సన్లు వెంపటి పార్వతమ్మశంకరయ్య, కర్ణ అనూష శరత్‌రెడ్డి, నిడమనూరు మార్కెట్ చైర్మన్ మర్ల చంద్రారెడ్డి, ఎడమ కాల్వ మాజీ చైర్మన్ మలిగిరెడ్డి లింగారెడ్డి, గుంటక వెంకట్‌రెడ్డి తదితరులు ఉన్నారు.



మార్కెట్ కమిటీ చైర్మన్ జవ్వాజి వెంకటేశ్వర్లుతో ప్రమాణ స్వీకారం చేయిస్తున్న అధికారి శ్రీకాంత్

హాజరుకాని ఎమ్మెల్సీ, ఎంపీపీలు

హాలియా మార్కెట్ కమిటీ పాలకవర్గ ప్రమాణస్వీకారోత్సవానికి ఉమ్మడి నల్లగొండ జిల్లా ఎమ్మెల్సీతో పాటు తిరుమలగిరి(సాగర్) మండల జెడ్పీటీసీ, అనుముల, తిరుమలగిరి, పెద్దవూర మండలాల ఎంపీపీలు హాజరు కాలేదు. దీంతో బీఆర్ఎస్ పార్టీలో చర్చనీయాంశంగా మారింది.

ప్రజా సమస్యలు సత్వరమే పరిష్కరించండి

- ప్రజావాణిలో అదనపు కలెక్టర్ భాస్కర్‌రావు

నల్లగొండ: ప్రజావాణిలో విన్నవించిన ప్రజా సమస్యలను సత్వరమే పరిష్కరించాలని అదనపు కలెక్టర్ భాస్కర్‌రావు సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం నల్లగొండ కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణికి ఆయన హాజరై ప్రజల నుంచి దాదాపు 38 ఫిర్యాదులను స్వీకరించారు. వాటిని సంబంధిత శాఖలకు అప్పగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి వెంకటేశ్వర్లు, మత్స్యశాఖ అధికారి వెంకయ్య, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజావాణికి వచ్చిన కొన్ని వినతులు

- ముఖ్యమంత్రి కేసీఆర్ ఇటీవల రాష్ట్రంలో ఉన్న కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్, థర్డ్ పార్టీ కార్మికుల వివరాలను పంపాలని కోరినందున మా వివరాలను ప్రభుత్వానికి పంపించాలని ప్రజావాణిలో అదనపు కలెక్టర్‌కు విద్యుత్ మీటర్ రీడింగ్ కార్మికులు వినతిప్రతం అందజేశారు.
- మా గ్రామంలో ఆక్రమణకు గురవుతున్న 30 ఎకరాల ప్రభుత్వ భూమిని కాపాడాలని ముదిమాణిక్యం గ్రామస్తులు అదనపు కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు. దీనిపై ఫిర్యాదు చేసినప్పటికీ రెవెన్యూ అధికారులు పట్టించుకోవడం లేదని తెలిపారు.
- మాడ్గులపల్లి మండలం కుక్కడం గ్రామంలో తప్పుడు పద్ధతిలో ఈడబ్ల్యూఎస్ సర్టిఫికెట్ పొందిన మునగాల చంద్రప్రతాప్‌రెడ్డిపై చర్యలు తీసుకోవాలని గ్రామానికి చెందిన కవిత అదనపు కలెక్టర్‌కు విన్నవించారు.



వినతులు స్వీకరిస్తున్న అదనపు కలెక్టర్

రోడ్డు ప్రమాదాల నివారణకు తనిఖీలు చేపట్టాలి

- ఎస్పీ అపూర్వరావు

నల్లగొండ క్రైం: రోడ్డు ప్రమాదాల నివారణకు నిరంతరం తనిఖీలు నిర్వహించాలని జిల్లా ఎస్పీ అపూర్వరావు ఆదేశించారు. సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో నిర్వహించిన నేరసమీక్ష సమావేశంలో ఆమె మాట్లాడారు. సంబంధిత అధికారులతో కలిసి రోడ్డు ప్రమాదాలు జరగకుండా మూలమలుపులు, ప్రమాద స్థలాలను గుర్తించి హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేయాలన్నారు. మద్యం తాగి వాహనాలు నడపకుండా నిరంతరం తనికీలు చేపట్టాలన్నారు. కాలం చెల్లిన వాహనాలను గుర్తించి సీజ్ చేయాలన్నారు. నంబర్‌ప్లేట్ లేకుండా, ఎలాంటి ఆధారాలు లేకుండా వాహనాలు నడిపితే చట్టపరంగా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సమావేశంలో ఏఎస్పీ ప్రసాద్‌రావు, ఎస్‌బీ డీఎస్పీ మొగిలయ్య, డీసీఆర్‌బీ డీఎస్పీ రమేష్, నల్లగొండ డీఎస్పీ నర్సింహారెడ్డి, దేవరకొండ డీఎస్పీ నాగేశ్వర్‌రావు తదితరులు పాల్గొన్నారు.



బాధితులతో మాట్లాడుతున్న ఎస్పీ

గ్రీవెన్స్‌డేతో బాధితులకు భరోసా

పోలీస్ గ్రీవెన్స్ డేతో బాధితులకు భరోసా కలుగుతుందని ఎస్పీ అపూర్వరావు అన్నారు. సోమవారం తన కార్యాలయంలో నిర్వహించిన పోలీస్ గ్రీవెన్స్‌లో బాధితుల నుంచి ఫిర్యాదులు స్వీకరించి వారితో మాట్లాడారు. భూ సమస్యలు శాంతిభద్రతల సమస్యగా మారకుండా చూడాలని పోలీస్ అధికారులను ఆదేశించారు.

కుక్కలు, పందులను నియంత్రించండి

- సీసీ రోడ్లు, డ్రెయినేజీల నిర్మాణం చేపట్టాలి
- కోతులను పట్టి అడవిలో వదలాలి
- 'సాక్షి' ఫోన్‌ఇన్‌లో విన్నవించిన నల్లగొండ పట్టణ ప్రజలు
- సమస్యలన్నీ పరిష్కరిస్తామన్న కమిషనర్ రమణాచారి

నల్లగొండ టూటౌన్: నీలగిరి మున్సిపల్ పరిధిలోని అన్ని వార్డుల్లో గల వివిధ కాలనీల్లో ఎక్కడపడితే అక్కడ గుంపులు గుంపులుగా తిరుగుతున్న కుక్కలు, కోతులు, పందుల సమస్యను వెంటనే పరిష్కరించాలని ప్రజలు విన్నవించారు. సోమవారం నల్లగొండ మున్సిపల్ కమిషనర్‌తో సాక్షి ఆధ్వర్యంలో నిర్వహించిన ఫోన్‌ఇన్ కార్యక్రమంలో పలు కాలనీల వాసులు తమ సమస్యలను వివరించారు. కొన్ని కాలనీల్లో మురుగు నీటితో ఇబ్బందులు పడుతున్నామని, డ్రెయినేజీలు నిర్మించాలని విజ్ఞప్తి చేశారు. అదేవిధంగా వీధిలైట్లు లేక చీకటిగా ఉందని రాత్రిపూట వెళ్తుంటే కుక్కలు వెంటపడుతున్నాయని పలువురు పేర్కొన్నారు. ప్రజల సమస్యలు మున్సిపల్ కమిషనర్ డాక్టర్ కేవీ.రమణాచారి సావధానంగా విని అన్నింటినీ వెంటనే పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.



ఫోన్‌లో ప్రజల సమస్యలు వింటున్న మున్సిపల్ కమిషనర్ రమణాచారి

ప్రజల సమస్యలు- కమిషనర్ సమాధానాలు

ప్రశ్న : మా వార్డుల్లో పందులు, కుక్కల సమస్య తీవ్రంగా ఉంది. మేకలను కరవడంతో తీవ్రంగా నష్టపోతున్నాం. వెంటనే వాటిని నివారించాలి.
– సీతారాములు 5వ వార్డు, మసీరుద్దీన్, 22వ వార్డు

కమిషనర్ : పందుల యజమానులతో మాట్లాడాం. పందులను పట్టణంలోకి వదలొద్దని సూచించాం. కుక్కల నియంత్రణకు చర్యలు చేపడుతున్నాం.

ప్రశ్న : మాసం దుకాణాలు ఎక్కువ కావడంతో కుక్కలు విపరీతంగా పెరిగాయి. నివారణకు చర్యలు తీసుకోవాలి. – రహీంఖాన్, 22వ వార్డు

కమిషనర్ : దుకాణాల బయట మాసం బొక్కలు, ఇతర వ్యర్థాలు వేయకుండా చూస్తాం.

ప్రశ్న : రెడ్డి కాలనీ, 21వ వార్డులో సీసీ రోడ్లు, డ్రెయినేజీ నిర్మాణం చేపట్టాలి. కొన్ని చోట్ల తాగునీరు రావడం లేదు. – హరీష్, రెడ్డి కాలనీ, పందిరి శ్యాంసుందర్, 21వ వార్డు

కమిషనర్ : ఏప్రిల్ తర్వాత సీసీ రోడ్లు, యూజీడీలు నిర్మిస్తాం. సిబ్బందిని పంపించి తాగునీటి సమస్య లేకుండా పరిష్కరిస్తాం.

కుక్కలను పెంచుకునేవారు రిజిస్ట్రేషన్ చేసుకోవాలి

పట్టణంలోని వివిధ కాలనీల్లో పందులు, కుక్కలు, కోతులు సమస్య పరిష్కరించేందుకు తక్షణమే చర్యలు తీసుకుంటాం. కుక్కలను సాదుకునేవారు మున్సిపాలిటీలో రిజిస్ట్రేషన్ చేసుకోవాలి. ప్రతి కుక్కకు సంతాన రహిత ఆపరేషన్ చేసి యాంటీ రేబిస్ ఇంజక్షన్ వేస్తాం. 8,728 కుక్కలు పట్టుకొని 8620 కుక్కలకు ఆపరేషన్లు చేశాం. సీసీ రోడ్లు, డ్రెయినేజీకి సంబంధించి నిధులు రాగానే పనులు చేపడతాం. సాక్షి ఫోన్‌ఇన్ ద్వారా ప్రజలు తెలిపిన సమస్యలను పరిష్కరిస్తాం.

– రమణాచారి, మున్సిపల్ కమిషనర్

ప్రశ్న : తాగునీటి పైప్‌లైన్ వాల్వ్ డ్రెయినేజీలో ఉండడంతో నీరు కలుషితం అవుతుంది. దాన్ని పక్కకు మార్చేలా చర్యలు తీసుకోవాలి.
– ఎండీ.బషీరొద్దీన్ 12వ వార్డు, మాధవనగర్

కమిషనర్: మున్సిపల్ సిబ్బందిని పంపించి వాల్వ్‌ను పక్కకు పెట్టించి నీరు కలుషితం కాకుండా చూస్తాం.

ప్రశ్న : వీధిలైట్లు లేక చీకట్లో ఇబ్బందులు పడుతున్నాం.. వెంటనే అమర్చాలి. – శంకర్, 28వ వార్డు

కమిషనర్ : సిబ్బందిని పంపి వీధిలైట్లకు మరమ్మతులు చేయిస్తాం.

ప్రశ్న : వెంకటరమణ కాలనీల్లో సీసీ రోడ్లు, మురికి కాలువలు లేక దోమలతో ఇబ్బందులు పడుతున్నం. సమస్య పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలి .
– విజయ్, 9వ వార్డు, వెంకటరమణ కాలనీ

కమిషనర్ : మురుగు నీరు నిల్వ ఉండకుండా దోమలు రాకుండా చర్యలు తీసుకుంటాం.

ప్రశ్న : పందులతో 2 ఎకరాల పొలం పాడైంది. పందులను శివారు ప్రాంతాలకు తరలించాలి.
– మల్లేష్, 9వ వార్డు, రుద్రమదేవి కాలనీ

కమిషనర్ : పందుల సమస్యను పరిష్కరిస్తాం.

ప్రశ్న : శ్మశాన వాటికల్లో చెత్త పోయకుండా చర్యలు చేపట్టాలి. – బొంత నాగరాజు, 20వ వార్డు

కమిషనర్ : శ్మశాన వాటికల్లోని చెత్తను మున్సిపల్ వాహనాల ద్వారా డంపింగ్ యార్డుకు తరలిస్తాం.

ప్రశ్న : మా వార్డుల పరిధిలో ఒకే దగ్గర మూడు స్పీడ్ బ్రేకర్లు వేశారు. వాటిని తొలగించాలి...
– ఎండీ రఫీయుద్దీన్, 22వ వార్డు, వెంకటాచారి, 21వ వార్డు

కమిషనర్ : పరిశీలించి అవసరం లేకుంటే వెంటనే తొలగించేందుకు చర్యలు తీసుకుంటాం.

ప్రశ్న : అండర్‌పాస్ వద్ద వీధి లైట్లు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. వెంటనే లైట్లు వేయించాలి.
– యాదగిరి, జి.శ్రీకాంత్ 3వ వార్డు, కేశరాజుపల్లి

కమిషనర్ : కేశరాజుపల్లి అండర్‌పాస్ వద్ద వెంటనే లైట్లు వేయించి ప్రజల ఇబ్బందులు తీరుస్తాం.

క్లుప్తంగా

రైలు నుంచి దిగబోయి వ్యక్తి మృతి


జగదీష్ మృతదేహం

మిర్యాలగూడ అర్బన్: వేగంగా వెళ్తున్న రైలు నుంచి దిగబోయి ఓ వ్యక్తి మృతిచెందాడు. నల్లగొండ జిల్లా మిర్యాలగూడలో ఆదివారం రాత్రి చోటు చేసుకున్న ఈ ఘటన వివరాలు ఇలా ఉన్నాయి. కామారెడ్డి జిల్లా కేంద్రానికి చెందిన జగదీష్ రాజ్‌పురోహిత్(28) మిర్యాలగూడ పట్టణంలో ఫ్లేవుడ్ దుకాణం నిర్వహిస్తూ రవీంద్రనగర్‌కాలనీలో నివాసముంటున్నాడు. అహ్మదాబాద్ నుంచి మిర్యాలగూడకు వచ్చేందుకు ఆదివారం బావానగర్–కాకినాడ రైలు ఎక్కాడు. రాత్రి 11:45 నిమిషాలకు మిర్యాలగూడ స్టేషన్‌లో ఆగిన రైలు తిరిగి కదిలింది. నిద్రలో ఉన్న జగదీశ్ రాజ్‌పురోహిత్‌కు మెలకువ రావడంతో వెళ్తున్న రైలు నుంచి రెండో ప్లాట్‌ఫాంపై దిగేందుకు దూకాడు. ప్రమాదవశాత్తు అతడు రైలు, ప్లాట్‌ఫాం మధ్యలో ఇరుక్కుని, తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతిచెందాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు రైల్వే పోలీసులు పేర్కొన్నారు.

నేడు యాదగిరీశుడి కల్యాణం

- రాత్రి కల్యాణోత్సవంలో పాల్గొననున్న మంత్రులు.
- ఏర్పాట్లు పూర్తి చేసిన ఆలయ అధికారులు


మాఢ వీధిలో స్వామి వారి ఎదుర్కోలు ఉత్సవం

యాదగిరిగుట్ట: యాదగిరీశుని కల్యాణ మహోత్సవ నిర్వహణకు ఆలయ అధికారులు, ఆచార్యులు, ఏర్పాట్లు పూర్తి చేశారు. బ్రహ్మోత్సవాల్లో అత్యంత విశేష పర్వమైన కల్యాణోత్సవం మంగళవారం రాత్రి 8గంటల నుంచి ప్రారంభం కానుంది. యాదాద్రీశుడి ప్రధానాలయం ఉద్ఘాటన తర్వాత తొలి సారి జరుగుతున్న వేడుకను వైభవంగా నిర్వహించేందుకు అంతా సిద్ధం చేశారు. ఉత్సవంలో పాల్గొనేందుకు వచ్చే వీఐపీలు, భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా పోలీసులు చర్యలు తీసుకుంటున్నారు.

కల్యాణోత్సవం ఇలా..

యాదాద్రీశుడి ప్రధానాలయంలో రాత్రి 7.30గంటలకు గజ వాహన సేవపై స్వామి వారు పెళ్లి కొడుకుగా ముస్తాబై మాఢ వీధుల్లో ఊరేగుతూ బ్రహ్మోత్సవ మండపానికి 8గంటలకు చేరుకుంటారు. ఆచార్యులు, వేదపండితులు పాంచరాత్ర ఆగమశాస్త్ర ప్రకారం కల్యాణ వేడుకను ప్రారంభిస్తారు. తుల లగ్నంలో అమృత ఘడియల్లో రాత్రి 9.30గంటలకు స్వామి వారు అమ్మవారికి మాంగళ్యధారణ గావిస్తారు.

జగన్మోహినిగా నారసింహుడు

యాదగిరిగుట్ట: యాదగిరీశుడి ఉత్సవాలు సోమవారం నాటికి ఏడవ రోజుకు చేరాయి. కల్యాణోత్సవానికి ముందస్తుగా పెళ్లి చూపుల పర్వం జరుపుకున్న స్వామివారు ఉదయం జగన్మోహిని రూపం దాల్చాడు. రాత్రి అశ్వవాహనంపై నారసింహుని ఎదుర్కోలు మహోత్సవం నిర్వహించారు.

అశ్వవాహనంపై స్వామివారు.. ముత్యాల పల్లకిపై అమ్మవారు..

యాదాద్రీశుడి బ్రహ్మోత్సవాల్లో ముఖ్యమైన ఎదుర్కోలు ఉత్సవం వేద మంత్రోచ్ఛారణలతో జరిగింది. శ్రీలక్ష్మీ దేవితో నారసింహుని కల్యాణోత్సవంలో భాగంగా పెళ్లి చూపుల తతంగాన్ని నిర్వహించారు. సాయంత్రం 6గంటలకు అశ్వవాహనంపై స్వామిని, ముత్యాల పల్లకిపై అమ్మవారిని అలంకరించి ప్రధానాలయ మాఢ వీధుల్లో ఊరేగించారు. అనంతరం తూర్పు రాజగోపురం ముందు గల మాఢ వీధిలో పశ్చిమ ముఖంగా కూర్చోబెట్టి, అమ్మవారిని తూర్పు ముఖంగా అధిష్ఠించారు. దీంతో ఆలయ ఈఓ గీతారెడ్డి, అనువంశిక ధర్మకర్త బి.నర్సింహమూర్తి, ప్రధానార్చకులు, అర్చకులు, ఇతర అధికారులు స్వామి అమ్మవార్లకు ఇరు పక్షాలుగా వీడిపోయి పెద్దలుగా వ్యవహరించారు. ఇరువురి గుణగణములను ఆచార్యులు చర్చించుకున్నారు. శ్రీస్వామి వైపు ఉన్న వారికి, అమ్మవారి పక్షాన ఉన్న వారికి గుణగణములు, ఆదాయ, వ్యయాలు, తదితర అంశాలను వివరించారు. సుగుణములు కలిగిన అమ్మవారిని అమృతమైన గడియలో శ్రీస్వామి వారు పరిణయం ఆడాలని కోరారు. అనంతరం స్వామి అమ్మవార్ల తిరు కల్యాణ వేడుకకు సమయం నిర్ణయించారు. మంగళవారం రాత్రి 8గంటలకు అమ్మవారిని వివాహం చేసుకునేందుకు ముహూర్తం నిర్ణయించారు.


అశ్వవాహనం, ప్రత్యేక పల్లకిపై స్వామి అమ్మవారి ఊరేగింపు


పట్టువస్త్రాలు చూపెడుతున్న ఆచార్యులు


ఆస్థాన వైదిక ప్రార్థన చేస్తున్న ఆచార్యులు

మాఢ వీధుల్లో ఊరేగిన స్వామివారు

నిత్య పూజలందుకుంటున్న శ్రీలక్ష్మీనరసింహుడు ఉదయం సుర, అసురులను సమ్మోహన పరిచే జగన్మోహినిగా అవతరించాడు. అలంకార సంబురాల్లో భాగంగా ఉదయం 9గంటలకు జగన్మోహిని రూపంలో స్వామివారిని అలంకరించి ఆలయ మాఢ వీధుల్లో ఊరేగించారు. ఈ వేడుకల్లో అనువంశిక ధర్మకర్త బి.నర్సింహమూర్తి, ఈఓ గీతారెడ్డి పాల్గొన్నారు.


ప్రదర్శన ఇస్తున్న కళాకారులు


రంగులు రుద్దుకుంటున్న విప్ సునిత, ఈఓ

ఆలయంలో నేడు..

బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం ఉదయం 9గంటలకు శ్రీరామ అలంకారం, హనుమంత సేవ, రాత్రి 7గంటలకు నుంచి గజవాహన శేవ, ఆ కల్యాణ మహోత్సవం.

కల్యాణోత్సవ ఏర్పాట్లు పరిశీలన


పోలీస్ అధికారులకు సూచనలు ఇస్తున్న డీసీపీ రాజేష్ చంద్ర

యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి వారి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం జరిగే స్వామి అమ్మవార్ల తిరుకల్యాణోత్సవ ఏర్పాట్లను డీసీపీ రాజేష్‌చంద్ర సోమవారం పరిశీలించారు. కొండపై తూర్పు రాజగోపురం ముందు బ్రహ్మోత్సవ మండపం వద్ద జరిగే కల్యాణ వేడుకకు సంబంధించిన వేదిక, వీవీఐపీ, వీఐపీ, ఆచార్యులు, భక్తులకు సంబంధించిన గ్యాలరీ ఏర్పాట్లను చూశారు. భక్తులు ఎక్కడ నుంచి వస్తారు, వీవీఐపీలు, వీఐపీలు, ఎక్కడ కూర్చుంటారు, శ్రీస్వామి వారి సేవ ఆలయం నుంచి ఎలా అవస్తుందనే అంశాలను ఆలయాధికారులతో చర్చించారు. ఇక కొండపైకి వాహనాలు వచ్చిన సమయంలో ఎక్కడెక్కడ పార్కింగ్ చేయాలనే వాటిపై స్థానిక పోలీసులకు సూచించారు. డీసీపీ వెంట ఏసీపీలు నర్సింహారెడ్డి, సైదులు, సీఐలు సైదయ్య, నవీన్‌రెడ్డి, ఆలయాధికారులు దోర్బల భాస్కర్‌శర్మ, రాజన్‌బాబు తదితరులున్నారు.

పట్టువస్త్రాలు అందజేత


ఈఓకు పట్టువస్త్రాలు అందజేస్తున్న వద్లోజు వెంకటేష్

యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం ఆలయంలో నిర్వహించే స్వామి అమ్మవార్ల తిరు కల్యాణ వేడుకకు మాజీ ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి తన కుటుంబం తరఫున పంపించిన పట్టువస్త్రాలు, ముత్యాల తలంబ్రాలను వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు వద్లోజు వెంకటేష్ సోమవారం ఆలయ ఈఓ గీతారెడ్డికి అందజేశారు. స్వామివారి జగన్మోహిని అలంకార సేవ ఊరేగింపు పూర్తి అయిన తరువాత ప్రథమ ప్రాకార మండపంలో అందించారు.

ముస్తాబవుతున్న ఆలయం..


బ్రహ్మోత్సవ మండపం ముందు కల్యాణ వేదికను సిద్ధం చేస్తున్న సిబ్బంది

స్వామి అమ్మవార్ల కల్యాణం జరిగే బ్రహ్మోత్సవ మండపాన్ని పూల అలంకరణతో సిబ్బంది తీర్చిదిద్దుతున్నారు. ఇక తూర్పు మాఢ వీధిలో భక్తులు, వీఐపీలు కూర్చొని కల్యాణాన్ని తిలకించే విధంగా ప్రత్యేక గ్యాలరీలను ఏర్పాటు చేస్తున్నారు. క్యూకాంప్లెక్స్, ఉత్తర రాజగోపురం ముందు ఖాళీ స్థలాల్లో ఎల్‌ఈడీ స్క్రీన్స్‌లో కల్యాణం తిలకించేలా ఏర్పాట్లు చేస్తున్నారు. వేడుకకు రాష్ట్ర మంత్రులు గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి, అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి, ఎర్రబెల్లి దయాకర్‌రావు, సబితాఇంద్రారెడ్డి, సీఎస్ శాంతికుమారితో పాటు 10 మంది ఐఏఎస్ అధికారులు హాజరుకానున్నట్లు ఈఓ గీతారెడ్డి తెలిపారు.

చోరీలకు పాల్పడుతున్న ముగ్గురి అరెస్ట్


నిందితుల వివరాలు వెల్లడిస్తున్న సీఐ సురేష్

మిర్యాలగూడ అర్బన్: చోరీలకు పాల్పడుతున్న ముగ్గురు నిందితులను పోలీసులు అరెస్ట్ చేశారు. సోమవారం స్థానిక టూటౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో సీఐ నిగిడాల సురేష్ వివరాలు వెల్లడించారు. మిర్యాలగూడ పట్టణం సీతారాంపురం గీతమందిర్‌కు చెందిన చిన్నపల్లి రవి, హనుమాన్‌పేటకు చెందిన రమావత్ రాజేష్, అనుముల మండలం హాజారిగూడం గ్రామానికి చెందిన కొత్తపల్లి అంజి ముగ్గురు స్నేహితులు. వీరు చెడు వ్యసనాలకు అలవాటు పడి అవసరాలను తీర్చుకునేందుకు కొంతకాలంగా చోరీలకు పాల్పడుతున్నారు. వీరు గత సంవత్సరం డిసెంబర్, ఫిబ్రవరి నెలలో పట్టణంలోని ప్రకాశ్‌నగర్, శాంతినగర్, హాజారిగూడం గ్రామాల్లోని పలు ఇళ్లలో చోరీలు చేశారు. ఈ క్రమంలో సోమవారం ఉదయం పట్టణంలోని కేసీఆర్ చౌరస్తా వద్ద తనిఖీలు చేస్తుండగా బైక్ వెళ్తున్న ముగ్గురు అనుమానాస్పదంగా కనిపించారు. పోలీసులను చూసి పారిపోయేందుకు ప్రయత్నించగా అదుపులోకి తీసుకున్నారు. విచారణలో నేరాలను అంగీకరించారు. వారి వద్ద నుంచి 5.3 గ్రాముల బంగారం, వెండి వస్తువులతో పాటు రూ.46 వేలు, బైక్‌తో పాటు రెండు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించినట్లు సీఐ వివరించారు. కార్యక్రమంలో ఎస్‌ఐ ఎస్.కృష్ణయ్య, హెడ్‌కానిస్టేబుల్ పి.వెంకటేశ్వర్లు ఉన్నారు.

సాంకేతిక పరిజ్ఞానంపై అవగాహన కల్పించాలి

గరిడేపల్లి : వ్యవసాయ అనుబంధ రంగాల్లో రైతులకు సాంకేతిక పరిజ్ఞానంపై శాస్త్రవేత్తలు అవగాహన కల్పించాలని సూర్యాపేట జిల్లా వ్యవసాయ శాఖాధికారి బి.రామారావునాయక్ కోరారు. 13వ విడత ప్రధాన మంత్రి సమ్మాన్ నిధి యోజన పథకం నగదు బదిలీ కార్యక్రమంలో భాగంగా సోమవారం కేవీకేలో పీఎం నరేంద్రమోదీ ప్రత్యక్ష వీక్షణ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో కేవీకే శాస్త్రవేత్తలు లవకుమార్, నరేష్, కిరణ్, తదితరులున్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికల షెడ్యూల్ విడుదల

- ముగియనున్న కృష్ణారెడ్డి పదవీకాలం
- జిల్లాకు మరోసారి అవకాశం దక్కేనా..

సాక్షి, యాదాద్రి: భువనగిరి జిల్లాకు చెందిన ఎమ్మెల్సీ ఎలిమినేటి కృష్ణారెడ్డి పదవీకాలం మార్చితో ముగియనుంది. ఎన్నికల సంఘం ఎమ్మెల్యే కోటాలో ఖాళీ కానున్న మూడు ఎమ్మెల్సీ స్థానాలకు షెడ్యూల్‌ను సోమవారం విడుదల చేసింది. ఎమ్మెల్యే కోటాలో ఎమ్మెల్సీగా ఎన్నికైన కృష్ణారెడ్డి పదవీకాలం మార్చిలో ముగియనుండడంతో మరోసారి జిల్లాకు ఎమ్మెల్సీ పదవి వస్తుందా అన్న ఆసక్తి రాజకీయ వర్గాల్లో నెలకొంది. ఇప్పటికే భువనగిరి జిల్లాకు పలువురు బీఆర్‌ఎస్ నాయకులు తమకు అవకాశం ఇవ్వాలని అధినేత కేసీఆర్, వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ వద్ద ప్రయత్నాలు ప్రారంభించారు. మరోసారి అవకాశం కోసం ఎలిమినేటి కృష్ణారెడ్డి కుటుంబం ఎదురు చూస్తోంది. మాజీ ఎమ్మెల్యే బూడిద బిక్షమయ్యగౌడ్, సీనియర్ నాయకుడు చింతల వెంకటేశ్వర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్సీలు కర్నె ప్రభాకర్, నేతి విద్యాసాగర్, రైతు బంధు సమితి జిల్లా అధ్యక్షుడు కొలుపుల అమరేందర్ మరికొందరు నేతలు ప్రయత్నాలు ప్రారంభించారు. అయితే, ఈ పదవికి రాష్ట్రం యూనిట్‌గా అభ్యర్థిని ఎంపికచేసే అవకాశం ఉన్నందున అధినేత కేసీఆర్ చూపు ఎవరిమీద ఉంటుందోనన్న ఆసక్తి అందరిలోనూ ఉంది. ఎమ్మెల్సీ ఎన్నికకు అభ్యర్థుల ఎంపిక సామాజికవర్గ సమీకరణల మీద ఆధారపడి ఉందని రాజకీయ పరిశీలకులు భావిస్తున్నారు.

శివాలయంలో విశేష పూజలు

యాదగిరిగుట్ట : యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామికి అనుబంధంగా ఉన్న శ్రీపర్వతవర్ధిని సమేత రామలింగేశ్వరస్వామి ఆలయంలో సోమవారం విశేష పూజలు నిర్వహించారు. ఆలయ హోమ మండపంలో తొలుత అగ్ని ప్రతిష్ఠ ఆ తర్వాత రుద్ర హవనం చేపట్టారు. ఇక మహాశివుడికి అభిషేకం, అర్చనలు గావించారు. శివ గర్భాలయం, ముఖ మండపంలోని స్పటిక లింగానికి పూజలు చేసి హారతినిచ్చారు. అదే విధంగా యాదాద్రీశుడికి నిత్య కైంకర్యాలు కొనసాగాయి.


మహా శివుడి స్పటిక లింగానికి హారతినిస్తున్న పూజారులు

మహిళను కాపాడిన వైద్య విద్యార్థులు

సూర్యాపేట క్రైం : చెరువులో దూకి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన మహిళను వైద్య విద్యార్థులు కాపాడారు. ఈ ఘటన సూర్యాపేట పట్టణంలో సోమవారం వెలుగులోకి వచ్చింది. స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. జిల్లా కేంద్రం మినీ ట్యాంక్ బండ్‌పై ఆదివారం రాత్రి చందన కళాశాలలో ఫిజియోథెరఫీ మూడో సంవత్సరం చదువుతున్న వైద్య విద్యార్థులు తరుణ్, వేదవ్యాస్, యోగేష్, నాగ దత్త వాకింగ్ చేస్తున్నారు. అదే సమయంలో వారికి దగ్గర నుంచి సూర్యాపేటకు చెందిన ఓ మహిళ ఆత్మహత్య చేసుకునేందుకు వచ్చి చెరువులో దూకింది. వెంటనే చూసిన విద్యార్థులు ఏం ఆలోచన చేయకుండా చెరువులోకి దూకి ఆమెను కాపాడారు. పలువురు విద్యార్థులను అభినందించారు.

బీజేపీని ఓడించేందుకు కాంగ్రెస్‌కు అయినా మద్దతు ఇస్తాం


మాట్లాడుతున్న జూలకంటి రంగారెడ్డి

హుజూర్‌నగర్: బీజేపీని ఓడించేందుకు కాంగ్రెస్‌కు అయినా మద్దతు ఇస్తామని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు, మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి వెల్లడించారు. సోమవారం హుజూర్‌నగర్ వచ్చిన ఆయన స్థానిక సీపీఎం కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రాబోయే ఎన్నికల్లో కేంద్రంలో, రాష్ట్రంలో బీజేపీని అధికారంలోకి రాకుండా చూడటమే సీపీఎం, వామపక్షాల ఏకైక లక్ష్యం అని ఆయన అన్నారు. దానికి అనుగుణంగానే ఎన్నికల ఎత్తుగడలు ఉంటాయని చెప్పారు. బీజేపీని ఒంటరిగా ఓడించే శక్తి ఉన్నదగ్గర ఒంటరిగానే ఎదిరిస్తామని చెప్పారు. రాబోయే ఎన్నికల్లో కలిసి వచ్చే పార్టీలతో కలిసి ముందుకు వెళతామని ఆయన తెలిపారు. బీజేపీ జెండా పట్టుకుని, వాళ్లకు జై కొట్టిన వారు ఎన్ని నేరాలు చేసినా, అక్రమాలకు పాల్పడినా వాళ్లపై ఎలాంటి కేసులు ఉండవని, సీబీఐ, ఈడీ వాళ్ల జోలికి వెళ్లవని ఆయన తెలిపారు.అదాని వందల కోట్లు ప్రజా ధనాన్ని కొల్ల గొడుతున్నాడని ఆరోపణలు వస్తున్నాయని కేంద్ర ప్రభుత్వానికి దమ్ముంటే అతనిపై చర్యలు తీసుకోవాలని కోరారు. సమావేశంలో నాయకులు నాగారపు పాండు, పల్లె వెంకటరెడ్డి, దుగ్గి బ్రహ్మం, వట్టెపు సైదులు, హుస్సేన్, యోనా, ఆర్ .మురళి, సీహెచ్ వీరమల్లు ,పాశం వెంకట్ నారాయణ, పి .వెంకట్ రెడ్డి, ఎస్. వెంకన్న తదితరులు పాల్గొన్నారు.